# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 91 క్రిష్ణా, గురువారం 25 - 12 - 2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349




**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 24,** దైవజనులకు ప్రతి నెల 5000 రూపాయలు పారితోషకము ఇస్తున్నటువంటి ప్రభుత్వము ఆగిపోయిన 12 నెలల పారితోషకాన్ని ఒకేసారి 60,000 రూపాయలు దైవసేవకుల ఖాతాలలో జమ చేయటం సంతోషకరమని పాస్టర్ జగన్ పాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ జగన్ పాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము చేస్తున్న మంచి పనులను కొనియాడారు. ఇంకా ఈ ప్రభుత్వానికి దేవుడు దైవ దీవెనలు అనుగ్రహించాలని దైవసేవకులు అందరూ ప్రార్థిస్తున్నామని తెలియజేశారు. క్రైస్తవులకు ముఖ్య పండుగ అయినటువంటి క్రిస్మస్ సందర్భంగా ఇంత మంచి పని చేసినటువంటి కూటమి ప్రభుత్వానికి, గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, టి.డి.పి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఈటె స్వామిదాస్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు..

### క్రీస్తు బోధనలు ఆదర్శనీయం..-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఎన్టీఆర్ జిల్లా,కలెక్టరేట్,డిసెంబర్ 24(బ్యూరో చీఫ్ సల్మాన్):** ఏసుక్రీస్తు త్యాగం అందరికీ ఆదర్శనీయమని.. క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాలతో ఆనందంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఏసు ప్రభువు ప్రేమ, కరుణ అనుసరణీయమని.. దైవదూతగా వచ్చిన ఏసు.. త్యాగం, ప్రేమ, కరుణలతో ప్రజలందరికీ ఒక మార్గం చూపారని తెలిపారు. పాపులను కూడా క్షమించడం, ఆయన క్షమాగుణానికి నిదర్శనమని అన్నారు. ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమన్నారు.ఇతరులకోసం కూడా ప్రార్ధనలు చేసే గొప్ప మనసు క్రైస్తవుల సొంతమని పేర్కొన్నారు. ఈ పర్వదినం జిల్లా ప్రజలందరికీ ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి తీసుకురావాలని ఆకాక్షించారు. క్రీస్తు కరుణతో జిల్లా అగ్రగామిగా నిలవాలని కోరుకుంటూ డా. లక్ష్మీశ శుభాకాంక్షలు తెలిపారు.

## పవిత్ర సంగమం ఫెర్రీ లో 'ఎన్ డి ఆర్ ఎఫ్' స్పెషల్ మోక్ డ్రిల్ల్..

### ప్రకృతి విపత్తు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించిన ఎన్డీఆర్ఎఫ్ అధికారులు.. అగ్ని ప్రమాదాలను సైతం నివారించేందుకు మోక్ డ్రిల్ చేసిన అగ్నిమాపక సిబ్బంది..




**ఎన్టీఆర్ జిల్లా,కొండపల్లి మున్సిపాలిటీ,డిసెంబర్ 24(బ్యూరో చీఫ్ సల్మాన్):** ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై 'ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బుధవారం నాడు ఇబ్రహీంపట్నం లోని పవిత్ర సంగమం వద్ద మాక్ డ్రిల్ ను నిర్వహించారు.వరదల్లో మరియు నది ప్రవాహంలో జరిగే బోట్ లేదా పడవ ప్రమాదాలను ఏవిధంగా ఎదురుకోవాలి అనే విషయాలను స్పష్టం గా చేసి ప్రేక్షకులకు చూపించారు.అనంతరం ఇళ్లలో జరిగే అగ్ని ప్రమాదాలను గృహిణి లు సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చు అనే విషయాన్ని గ్యాస్ సిలిండర్ తో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు అగ్ని మాపక సిబ్బంది.ఇది చూసిన మహిళలు చప్పట్లతో ఎన్డీఆర్ఎఫ్ మరియు అగ్నిమాపక సిబ్బంది కి ధన్యవాదాలు తెలిపారు.నిర్వహించిన మాక్ డ్రిల్లో పశు సంరక్షణ విధానాలను,నిండు గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల తగు స్యాఖల అధికారులు తెలుపగా వారితో పాటు కార్రిక్రమంలో పాల్గొన్న కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టి బాబు,ఇబ్రహీంపట్నం ఎంఆర్ఓ వెంకటేశ్వర్లు,సీఐ చంద్రశేఖర్ పాల్గొని ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు కృషి చేశారు.ఈ మాక్ డ్రిల్ ను చూసేందుకు ప్రజలు,వివిధ స్యాఖల అధికారులు పాల్గొన్నారు.




## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్.ఓ.సీల అందజేత..



**ఎన్టీఆర్ జిల్లా, గొల్లపూడి, డిసెంబర్ 24(బ్యూరో చీఫ్ సల్మాన్):** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు ఎల్.ఓ.సీల రూపంలో బుధవారం అందజేశారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని కార్యాలయంలో అనారోగ్య బాధితులకు లెటర్ ఆఫ్ క్రెడిట్ లను అందజేశారు. మైలవరం పట్టణానికి చెందిన నల్లబోతుల శేషుకు రూ. 1.21 లక్షలు, కొండపల్లికి చెందిన గర్నేపూడి దుర్గారావుకు రూ.70 వేల విలువైన ఎల్.ఓ.సిలు తాజాగా మంజూరయ్యాయి. వారు తక్షణమే తగు వైద్య సేవలు, శస్త్రచికిత్సలు పొంది ఆరోగ్యంగా వుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ లారీ యజమానులకు ఊరట.. ఫిట్‌నెస్ ఫీజుల పెంపు నిర్ణయం తాత్కాలిక వాయిదా

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 24,** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రవాణా లారీ యజమానులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. భారీగా పెంచిన ఫిట్‌నెస్ సర్టిఫికేట్ (%ఖీజ%) ఫీజుల నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రవాణా శాఖ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, పాత వాహనాలపై అదనపు భారం పడుతుండటంతో రవాణా రంగానికి చెందిన సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ ఊరటనిచ్చే నిర్ణయాన్ని తీసుకుంది. కేంద్రం తీసుకొచ్చిన నూతన నిబంధనల ప్రకారం 15 ఏళ్లు దాటిన భారీ వాహనాలకు ఫిట్‌నెస్ ఫీజు గతంలో కంటే భారీగా పెరిగింది. దీనివల్ల ఒక్కో లారీపై సుమారు రూ. 36 వేల వరకు ఆర్థిక భారం పడుతుందని అంచనా. ఇప్పటికే డీజిల్ ధరలు, విడిభాగాల ఖర్చులు పెరిగి ఇబ్బందుల్లో ఉన్నామని, ఇప్పుడు ఈ అదనపు ఫీజులు చెల్లించడం తమ వల్ల కాదని లారీ యజమానులు వాపోయారు. ఈ భారాన్ని తగ్గించకపోతే రవాణా సేవలను పూర్తిగా నిలిపివేస్తామని వారు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. లారీ యజమానుల సమ్మె హెచ్చరికతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం, వారి ప్రతినిధులతో ఉన్నత స్థాయి చర్చలు జరిపింది. రవాణా రంగం సంక్షోభంలో పడకుండా చూడటమే తమ ప్రాధాన్యతని, లారీ యజమానుల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తామని ప్రభుత్వం ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. చర్చలు సఫలం కావడంతో, ప్రస్తుతానికి పాత ఫీజులనే కొనసాగించాలని, పెంచిన ధరలను అమలు చేయవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనితో రాష్ట్రవ్యాప్తంగా లారీ యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ నిర్ణయం కేవలం తాత్కాలికం మాత్రమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ఫీజుల పెంపుపై మరిన్ని స్పష్టమైన ఆదేశాలు లేదా మినహాయింపులు వచ్చే వరకు వేచి చూడాలని నిర్ణయించింది. కేంద్రంతో సంప్రదింపులు జరిపి, రవాణా రంగానికి నష్టం కలగకుండా తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. అంతవరకు పాత విధానంలోనే ఫిట్‌నెస్ ప్రక్రియ కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# ఏపీకి ఆ రూట్లో కొత్తగా రైలు.. టైమింగ్స్, స్టాపింగ్స్ పూర్తి వివరాలివేఆంధ్రప్రదేశ్



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 24, ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త వినిపించింది. రాష్ట్రంలో కొత్తగా మరో రైలు నడపనుంది. గుంతకల్లు నుంచి నంద్యాల మీదుగా మార్కాపురం రోడ్ స్టేషన్ వరకూ కొత్త ప్యాసింజర్ రైలును నడపాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్యాసింజర్ రైలు ప్రతి రోజూ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అయితే ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే దానిపై క్లారిటీ లేదు. గుంతకల్లు – మార్కాపురం మధ్య డైలీ ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపిందని గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు వెల్లడించారు. త్వరలో రైలు ప్రారంభ తేదీ ఖరారు కానుందని తెలిపారు.

గుంతకల్లు – మార్కాపురం రోడ్ ప్యాసింజర్ రైలు సర్వీస్ వివరాలు

మరోవైపు గుంతకల్లు – మార్కాపురం ప్యాసింజర్ రైలు(57407) ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు గుంతకల్లు రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరుతుంది. ఈ రైలు నంద్యాల రైల్వే స్టేషన్‌కు రాత్రి 8 గంటల 30 నిమిషాలకు చేరుకుంటుంది. 8 గంటల 35 నిమిషాలకు నంద్యాల నుంచి బయల్దేరితే.. మార్కాపూర్ రోడ్డు స్టేషన్‌కు రాత్రి 11 గంటల 30 నిమిషాలకు చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో మార్కాపురం – గుంతకల్లు రైలు (57408) మార్కాపురంలో తెల్లవారుజామున 4 గంటల 30 నిమిషాలకు బయల్దేరుతుంది. నంద్యాలకు ఉదయం 7 గంటల 20 నిమిషాలకు చేరుకుంటుంది. ఐదు నిమిషాల అనంతరం నంద్యాల రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరితే.. ఉదయం 10 గంటల 30 నిమిషాలకు గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు ప్రకటనలో వెల్లడించారు. మరోవైపు గుంతకల్లు – మార్కాపురం – గుంతకల్లు రైలు.. మద్దికెర, పెండేకల్లు, డోన్, రంగాపురం, బేతంచర్ల, పాణ్యం. నంద్యాల, గాజులపల్లి, దిగువమెట్ట,గిద్దలూరు, సోమిదేవిపల్లి, జగ్గంబొట్ల కృష్ణాపురం, కంబం, తర్లుపాడు రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. మరోవైపు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి విజ్ఞప్తి మేరకు.. రైల్వే శాఖ ఈ ప్యాసింజర్ రైలును ఏర్పాటు చేసింది. మరోవైపు నంద్యాల మీదుగా గుంతకల్లుకు రైళ్లు నడిపించాలని ఈ ప్రాంతవాసులు గత కొంతకాలంగా కోరుతున్నారు. ఈ మార్గంలో నడిచే రైళ్లు.. అన్నీ కూడా రాత్రిపూట నడుస్తాయని.. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉందని ఆమె ఇటీవల రైల్వే శాఖ దృష్టికి తెచ్చారు. పగటి పూట ప్రయాణించేలా మెమో లేదా ప్యాసింజర్ రైలును నడిపించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే నంద్యాల మీదుగా.. గుంతకల్లు – మార్కాపురం రోడ్డు స్టేషన్ వరకూ డైలీ ప్యాసింజర్ రైలును రైల్వేశాఖ ప్రవేశపెడుతోంది.

# వేగంగా మెరుగైన సేవలు స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో అందించాలి

**ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతే లక్ష్యం కావాలి**

**రైతు ఆత్మహత్యల నివారణకు కార్యాచరణ చేపట్టాలి**

**నైపుణ్య ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం: సీఎం**



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 24, అమరావతి, డిసెంబరు 24: స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో భాగంగా పౌరులకు మెరుగైన సేవలు వేగంగా అందించేందుకు ప్రతి శాఖ ఇండికేటర్లు సిద్ధం చేసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై సచివాలయంలో ఆయా శాఖల నోడల్ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా పీ4 విధానాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు పథకం అమలును విజన్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబమూ సాధికారిత సాధించాలని, అలాగే వ్యక్తులకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ మిషన్ ముఖ్య లక్ష్యమన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలోని 30 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ఎంత ప్రయోజనం కలిగిందో అంచనా వేయాలని ఆదేశించారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. నైపుణ్య ఉద్యోగాల కల్పన అనేది అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే మొట్టమొదటి ప్రాధాన్యంగా పనిచేయాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. పది సూత్రాలకు సంబంధించిన అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని తెలిపారు. నీటి వనరుల సమర్థ వినియోగంతో పాటు నీటి ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. నీటి వినియోగంలో వివాదాలు లేకుండా చూడాలని.. .రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో కరువు అనే మాట లేకుండా వరద నీటి నిర్వహణ జరగాలని పేర్కొన్నారు. టెక్నాలజీ వినియోగంతో సాగు వ్యయం తగ్గేలా చూడాలన్నారు. డిమాండ్ ఆధారిత పంటల ఉత్పత్తి, కోల్డ్ చైన్, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి అంశాలపై దృష్టిపెట్టి రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలని అన్నారు. రైతు ఆత్మహత్యల నివారణకు సంబంధించి కార్యాచరణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలి: రాష్ట్రంలో రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించేలా లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలని చంద్రబాబు స్పష్టం చేశారు. రోడ్లు, రైతులు, అంతర్గత జల రవాణా, సీకార్గో, ఎయిర్ కార్గో లాంటి అంశాలతో పాటు కోల్డ్‌చైన్ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్, ఇంధన వ్యయాలను తగ్గించే అంశంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతతో పాటు మేడ్ ఇన్ ఆంధ్రా బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేసేలా స్పష్టమైన విధానం ఉండాలని దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడంతో పాటు గాలి, నీటి నాణ్యతల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. కేంద్ర నిధుల్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఆర్గానిక్ కూరగాయల ఉత్పత్తిపై ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. పౌరసేవలు సులభంగా అందేలా శాఖలన్నీ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని... ఆర్టీజీఎస్ ద్వారా సమాచారాన్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉక్కులో మరోసారి వీఆర్ఎస్! ఏడాది వ్యవధిలో మూడోసారి...

**570 మందిని బయటకు పంపేందుకు ప్రణాళిక**

**ఇప్పటికే రెండు విడతల్లో 1,633 మందికి వీఆర్ఎస్**

**నియామకాలు ఆపేసి...ఉద్యోగులను తీసేసి!**

**ఇదీ యాజమాన్యం తీరు**

**ఇలాగైతే పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా సాధ్యం**

**కార్మిక వర్గాల విస్మయం**

క్రైం కౌంటర్ న్యూస్ స్టీల్ ప్లాంటు మరోసారి వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్)ను బుధవారం ప్రకటించింది. ప్లాంటులో ఉన్న మానవ వనరుల రేషనలైజేషన్, సమర్థ వినియోగం, వ్యయాలను నియంత్రించి ఉత్పత్తి పెంచుకోవాలనే ఆలోచనతో వీఆర్ఎస్‌ను అమలు చేస్తున్నట్టు పేర్కొంది. ఈ ఏడాది ప్రారంభంలో మొదటిసారి వీఆర్ఎస్ ప్రకటించినప్పుడు 1,146 మంది సంస్థ ఇచ్చిన డబ్బులు తీసుకొని వెళ్లిపోయారు. జూన్ నెలలో రెండోసారి వీఆర్ఎస్ ప్రకటించినప్పుడు ఇంకో 487 మంది ముందుకొచ్చారు. మొదటి విడత వీఆర్ఎస్ తీసుకున్న అందరికీ ఫుల్ సెటిల్‌మెంట్ చేయగా, రెండోసారి వీఆర్ఎస్ తీసుకున్నవారికి 50 శాతమే ప్యాకేజీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, మిగిలిన మొత్తాలు తరువాత ఇస్తామని చెప్పి ఆరు నెలలైనా ఇప్పటివరకూ బకాయిలు ఇవ్వలేదు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు కూడా చెల్లించలేదు. ఉద్యోగులు అందరికీ మూడున్నర నెలల జీతం బకాయి పెట్టారు. నెల నెలా జీతాలు అందనందున వీఆర్ఎస్ తీసుకుని, ఆ డబ్బుతో ఏదో ఒకటి చేసుకుందామని అనుకుంటే అవి కూడా పూర్తిగా ఇవ్వకుండా ప్రస్తుత యాజమాన్యం వేధిస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇది చట్ట విరుద్ధమని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. చేతిలో డబ్బులు లేవంటున్న యాజమాన్యం వీఆర్ఎస్ ప్రకటన ఎలా ఇస్తుందని ప్రశ్నిస్తున్నాయి. ఈసారి మరో 570 మందికి వీఆర్ఎస్ ఇవ్వాలని ప్రణాళిక రూపొందించినట్టు సమాచారం.

స్టీల్ ప్లాంటు యాజమాన్యం నిర్ణయాలు కార్మిక వర్గాలను తీవ్ర విస్మయానికి గురిచేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందించిన సాయంతో ప్లాంటును లాభాల బాటలోకి తీసుకువస్తామని ప్రకటించిన యాజమాన్యం అందుకు విరుద్ధంగా చర్యలు చేపడుతోంది. గత నాలుగేళ్ల నుంచి నియామకాలు లేవు. పదోన్నతులు ఇవ్వడం లేదు. హెచ్ఆర్ఏ కోత పెట్టారు. మూడున్నర నెలల జీతాలు బకాయిలు పెట్టారు. ఇప్పుడు ఉత్పత్తి ఆధారిత జీతాలు అంటూ 20 శాతం తగ్గించి ఇస్తున్నారు. ఉద్యోగులు ప్లాంటు వదిలి వెళ్లిపోయే పరిస్థితులు తీసుకువచ్చారు.

ప్రతి నెలా సగటున 50 మంది పదవీ విరమణ చేస్తున్నారు. ఈ ఏడాది రెండు విడతలుగా వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) ప్రకటించి సుమారు 1,500 మందిని ఇంటికి పంపించేశారు. ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు 14 వేలు ఉండే ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు 9,385కి పడిపోయింది. ఎగ్జిక్యూటివ్‌లు 2,819 మంది, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 6,566 మంది కలిపి 9,385 మంది శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మరో 570 మందిని మూడో విడత వీఆర్ఎస్ ద్వారా తీసేయాలని ప్రణాళిక రూపొందించారు. అదేవిధంగా కాంట్రాక్టు వర్కర్లను ఐదు వేలకు తొలగించారు. మరో వైపు మూడు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా 92 శాతం ఉత్పత్తి చేయాలని ఒత్తిడి పెడుతున్నారు. ఏ మాత్రం ఉత్పత్తి తగ్గినా ఉద్యోగులు పనిచేయడం లేదని ప్రచారం చేస్తున్నారు. యంత్రాల మరమ్మతులు, నిర్వహణ పనులు గాలికి వదిలేశారు. దానివల్ల ఏ ప్రమాదం జరిగినా దానికి ఉద్యోగులే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు.

ఉత్పత్తి వ్యయం తగ్గింపు పేరుతో భారీ కొనుగోళ్లు ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని చెబుతూ పెల్లెట్లను లక్షలాది టన్నులు బయట కొంటున్నారు. కోక్ కూడా నాణ్యమైనది రావడం లేదు. దాంతో ఉత్పత్తుల్లో నాణ్యత లోపిస్తోంది. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ సృష్టించాల్సింది పోయి అందుకు విరుద్ధంగా డీగ్రేడ్ చేస్తున్నారు. నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సీఎండీ ఈలోగానే వీఆర్ఎస్ ప్రకటన ఇవ్వడం వెనుక కుట్ర దాగి ఉందని, దీనిపై సీబీఐతో విచారణ చేయించాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయన హయాంలో తీసుకున్న నిర్ణయాలపై కూడా విచారణ చేయాలని కోరుతున్నాయి. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను అనువుగాని వర్షాకాలంలో పునఃప్రారంభం చేసి, ఎక్కువ ఉత్పత్తి పేరుతో రోజుకు ఐదు వేల టన్నుల ఫూల్ ఐరన్‌ని నేలపాల్జేస్తున్నారని, ఈ నిర్ణయాల వల్ల రూ.2 వేల కోట్ల నష్టం వచ్చిందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. నష్టాలు వచ్చే తప్పుడు నిర్ణయాలు యాజమాన్యాలు తీసుకొని, ఉద్యోగులపైకి నెడుతున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తునామని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. సెయిల్‌లో ఉత్పత్తి, ఉద్యోగుల సంఖ్య ఎలా ఉందో చూసి, దాని ప్రకారం విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో ఉత్పత్తికి తగిన ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఏపీలో పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల,,, అకౌంట్లోకి డబ్బులు జమ



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 24, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లిస్తామని ప్రకటించిన చంద్రబాబు.. క్రిస్మస్‌కు ఒకరోజు ముందే నిధులు విడుదల చేశారు. డిసెంబర్ 25 క్రిస్మస్ నేపథ్యంలో పాస్టర్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని 8,418 మంది పాస్టర్లకు గౌరవ వేతనం కింద.. రూ.50.50 కోట్లను బుధవారం రోజున విడుదల చేసింది. క్రిస్మస్ రోజు నాటికి పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తామన్న చంద్రబాబు..ఒకరోజు ముందే పాస్టర్లకు నిధులు విడుదల చేశారు. 8,418 మంది పాస్టర్లకు నెలకు 5 వేల రూపాయల గౌరవ వేతనం చొప్పున ఏడాదికి రూ.60 వేలు అందించనున్నారు.డిసెంబర్ 22వ తేదీన విజయవాడలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు.. రాష్ట్రంలో క్రైస్తవుల గౌరవానికి, భద్రతు భంగం కలుగనీయమని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం అందరి కోసం పనిచేస్తుందని.. ప్రతి మతాన్నీ గౌరవిస్తుందన్నారు. క్రైస్తవుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో ఏళ్ల నుంచి క్రైస్తవ సంస్థలు విద్యా రంగంలో సేవ చేస్తున్నాయని.. లక్షలాది మంది జీవితాల్లో మార్పులు తెచ్చాయన్నారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి క్రైస్తవుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు వెల్లడించారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో రాష్ట్రంలో 977 చర్చిల నిర్మాణం కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.77 కోట్లు అందించిందని చంద్రబాబు గుర్తు చేశారు. ఐదేళ్లలో 377 చర్చి నిర్మాణాలు పూర్తి అయ్యాయని.. మిగతా వాటికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేసి త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. జెరూసలేం వెళ్లే వారికి ఆర్థిక సాయం అందిస్తున్న విషయాన్ని వివరించారు. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రిస్మస్ పండుగను ప్రభుత్వం తరపున తొలిసారిగా నిర్వహించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని చంద్రబాబు గుర్తు చేశారు. అలాగే పాస్టర్లకు కూడా గౌరవ వేతనం ప్రారంభించామని వివరించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని పాస్టర్లకు నెలకు 5 వేల రూపాయలు చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. వారికి రావాల్సిన పెండింగ్ బకాయిలను క్రిస్మస్ నాటికి అందిస్తామన్న చంద్రబాబు.. అన్నట్లుగానే ఒకరోజు ముందే పాస్టర్ల బ్యాంక్ అకౌంట్లలోకి రూ.50.50 కోట్లు విడుదల చేశారు.


## ఏపీలో కొత్త ఓటర్ల నమోదు విధానం.. ఏడాదికి నాలుగు సార్లు సవరణకు అవకాశం

క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 24, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ఇందుకోసం గతంలో ఉన్న పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఈ సవరణకు గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గారు ఆమోద ముద్ర వేయడంతో, కేంద్ర న్యాయశాఖ తాజాగా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వెలువరించింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పంచాయతీల ఓటర్ల జాబితా ప్రక్రియ మరింత పారదర్శకంగా, నిరంతరాయంగా కొనసాగేందుకు మార్గం సుగమం అయ్యింది.

గతంలో ఉన్న నిబంధనల ప్రకారం, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు లేదా మార్పులు చేసుకునేందుకు ఏడాదికి కేవలం ఒక్కసారి మాత్రమే అవకాశం ఉండేది. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీని ప్రామాణికంగా (%ూబ్ఝుశ్రీఅటఎ– ఊఅస్త్ర ఙఘ్వ%) తీసుకుని ఓటర్ల జాబితాను సవరించేవారు. దీనివల్ల జనవరి 2 తర్వాత 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటు హక్కు కోసం మళ్లీ ఏడాది కాలం వేచి చూడాల్సి వచ్చేది. ఈ పాత విధానం వల్ల అర్హులైన అనేక మంది యువత సకాలంలో ఓటు హక్కును పొందలేక ఇబ్బందులు పడేవారు.

తాజా సవరణ ప్రకారం, ఇకపై ఏడాదిలో నాలుగు సార్లు ఓటర్ల జాబితా రివిజన్ నిర్వహించనున్నారు. జనవరి 1వ తేదీతో పాటుగా, ఏప్రిల్ 1, జూలై 1 మరియు అక్టోబర్ 1వ తేదీలను కూడా అర్హత తేదీలుగా పరిగణిస్తారు. దీనివల్ల 18 ఏళ్లు నిండిన యువత తమకు సమీపంలోని తేదీలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. కేవలం కొత్త ఓట్ల నమోదు మాత్రమే కాకుండా, చిరునామా మార్పులు మరియు ఇతర సవరణలు కూడా ఈ నాలుగు సందర్భాల్లో చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని యువతకు మరియు కొత్త ఓటర్లకు భారీ ఉపశమనం లభించనుంది. 18 ఏళ్లు నిండిన వారు ఏడాది పొడవునా ఓటు హక్కు కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా, త్రైమాసిక ప్రాతిపదికన తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత భాగస్వామ్యాన్ని పెంచడానికి మరియు ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచడానికి ఈ ఆర్డినెన్స్ ఎంతగానో దోహదపడుతుంది. క్షేత్రస్థాయిలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ సమయానికి ఓటర్ల జాబితా ఖచ్చితంగా ఉండటానికి ఇది తోడ్పడుతుంది.



# రెవెన్యూ ప్రక్షాళన!

**సీఎం ఆదేశాలతో కీలక భేటీ**

**భూముల సర్వే, మ్యుటేషన్, పాస్‌పుస్తకాలు, 22ఏపై చర్చ**

**జేసీ నుంచి కొన్ని కీలక అధికారాలు ఆర్‌డీవోకు బదలాయింపు**

**మరికొన్ని అధికారాలు తహశీల్దార్‌కు**

**22ఏ నుంచి పట్టా భూముల తొలగింపు**

**ప్రజల ఇంటి స్థలాలకూ నిషేధ విముక్తి**

**జాయింట్ ఎల్‌పీఎమ్‌లు, విస్తీర్ణంలో తేడాలకు నిర్దిష్ట గడువులో పరిష్కారం**

**సమావేశంలో కీలక నిర్ణయాలు!**



క్రైం కౌంటర్ న్యూస్ ంవెన్యూ శాఖపై ప్రజల్లో సంతృప్త స్థాయిని 80 శాతానికి ఎలా తీసుకురావాలి? వారి పిటిషన్ల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలంటే తక్షణ చర్యలు ఏంతీసుకోవాలి? పారదర్శకత కోసం, అవినీతిరహిత సేవలు అందించడానికి చేపట్టాల్సిన మౌలిక చర్యలు ఏమిటి.. ఈ శాఖపై ఉన్న చెడు ముద్ర తొలగించి.. ఫీల్ గుడ్‌లోకి తీసుకొచ్చేందుకు ఏ సంస్కరణలు తీసుకురావాలన్న అంశాలపై ప్రభుత్వం సమాలోచనలు మొదలుపెట్టింది. బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. రెవెన్యూ ప్రక్షాళనకు అవసరమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఆ శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ దీనిపై నివేదిక రూపొందించనున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను త్వరలో సీఎంతో జరిగే భేటీలో అందించనున్నారు. కలెక్టర్ల సదస్సులో సీఎం అసంతృప్తిఆర్టీజీఎస్ సర్వేల్లో రెవెన్యూ శాఖ సేవలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, పిటిషన్లలో సింహభాగం రెవెన్యూవే ఉంటున్నాయి. దీంతో ఈ శాఖ పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నారు. అధికారులు కష్టపడి పనిచేస్తున్నా గుర్తింపు ఉండడం లేదని, రెవెన్యూ అంటేనే బ్యాడ్ అని ప్రజలు భావిస్తున్నారని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవాలంటూ ఏడాది గడువు పెట్టారు. రెవెన్యూ శాఖ ప్రక్షాళనకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఫీల్ బెటర్‌కు తీసుకొచ్చేందుకు అమలు చేయాల్సిన సంస్కరణలపై ఆశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా మంత్రి అనగాని బుధవారం కీలక భేటీ నిర్వహించారు.ఆ శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, అదనపు సీసీఎల్ఏ వెంకటమురళి, సర్వే డైరెక్టర్ కూర్మనాథ్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. రెవెన్యూ సర్వీసుల్లో ప్రజల అసంతృప్తికి ప్రధాన కారణమవుతున్న భూముల సర్వే, మ్యుటేషన్, పాస్‌పుస్తకాల పంపిణీ, పిటిషన్లపై అధికారుల సంతకాలు తీసుకోవాలన్న ఒత్తిళ్లు, ప్రైవేటు పట్టా భూములను 22(ఏ)లో చేర్చడం.. సరిహద్దు వివాదాల పరిష్కారం తదితర అంశాల్లో తీసుకురావలసిన మార్పులపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. జేసీల స్థాయిలో పలు కీలక అధికారాలు ఉ ంటున్నాయని, వారిపై ఉండే ఒత్తిళ్ల వల్ల సకాలంలో రెవెన్యూ అంశాల్లో సత్వర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, ఫైళ్ల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని గుర్తించారు. ఈ నేప?థ్యంలో జేసీ వద్ద ఉన్న అధికారాల్లో కొన్నింటిని రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్‌డీవో)కి బదలాయించాలని.. మరికొన్నిటిని తహశీల్దార్‌కు ఇస్తే సరిపోతుందన్న నిర్ణయానికి వచ్చారు. ప్రజలు రెవెన్యూ సేవలు కోరుతూ గ్రామ సచివాలయాల్లో ఇచ్చే పిటిషన్లపై స్థానిక వీఆర్‌వో లేదా సర్వేయర్ సంతకం ఉండాలన్న నిబంధన వల్ల అవినీతి జరుగుతోందన్న ఫిర్యాదులు అందాయు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ఆర్టీజీఎస్ నిర్వహిస్తున్న సర్వేల్లోనూ ఇదే కీలకంగా ఉంటోంది. సంతకాల పేరిట అవినీతి జరుగుతోందని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోందని తేలింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ఏ అధికారి సంతకమూ అవసరం లేదంటూ స్పష్టమైన ఆదేశాలివ్వాలని తాజాగా నిర్ణయించారు.ఆ భూములకు విముక్తి..

గత ప్రభుత్వంలో అన్యాయంగా, చట్టవిరుద్ధంగా 22(ఏ) జాబితాలో చేర్చిన పట్టా భూములను తొలగించాలని, ప్రజల ఇంటి స్థలాలకూ నిషేధ విముక్తి కల్పించాలని నిర్ణయించారు. జాయింట్ ఎల్‌పీఎమ్‌లు, భూమి విస్తీర్ణంలో తేడాల సవరణ వంటి విన్నపాలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రెవెన్యూ ప్రక్షాళనకు అవసరమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. దీనిపై స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ నివేదిక రూపొందించనున్నారు. అనంతరం త్వరలో ముఖ్యమంత్రి వద్ద జరిగే భేటీలో కార్యాచరణ ప్రణాళిక అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. శాఖాపరంగా చేపట్టాల్సిన చర్యలపై వెంటనే రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలివ్వాలని, వాటి అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సమావేశం నిర్ణయించింది.

# టీటీడీ భూ మార్పిడిపై పిల్ కొట్టివేత

క్రైం కౌంటర్ న్యూస్ అమరావతి, డిసెంబరు 24: తిరుపతి మండలం, పేరూరు పరిధిలో టీటీడీకి చెందిన భూమిని పర్యాటక శాఖతో పరస్పర మార్పిడి చేసుకోవడంతో పాటు ఆ భూమిని పర్యాటక శాఖ ఒబెరాయ్ గ్రూపునకు చెందిన స్వరా హొటల్స్‌కు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ తిరు క్షేత్రాల రక్షణ సమితి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. అంతకు ముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.... అధిక విలువ ఉన్న టీటీడీ భూమిని తక్కువ విలువ ఉన్న పర్యాటక శాఖ భూమితో పరస్పర మార్పిడి చేయడం సరికాదన్నారు. పర్యాటక శాఖ నుంచి తీసుకున్న భూమిని భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తామని మొదట టీటీడీ ప్రకటించిందన్నారు. తదనంతరం ప్రాజెక్టును మరో ప్రాంతానికి మార్చాలని నిర్ణయించిందన్నారు. టీటీడీ నుండి తీసుకున్న భూమిని పర్యాటక శాఖ హొటల్ నిర్మాణం కోసం ఒబెరాయ్ గ్రూపునకు చెందిన స్వరా హొటల్స్‌కు కేటాయించిందన్నారు. భూమార్పిడి వల్ల టీటీడీకి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. హొటల్ నిర్మాణం కోసం భారీ చెట్లను కూల్చివేస్తూ వోల్టా చట్టాన్ని ఉ ల్లంఘిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ... 'టీటీడీ, పర్యాటక శాఖ పరస్పరం మార్పిడి చేసుకున్న భూములు రోడ్డుకు ఇరువైపుల ఉంటాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ విలువ వేర్వేరుగా ఉంటుందే తప్ప రెండు భూముల విలువ ఒకటే ఉంటుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా పర్యాటక శాఖ భూమిని స్వరా హొటల్స్‌కు కేటాయించింది' అని తెలిపారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న



ధర్మాసనం... పరస్పరం మార్పిడి చేసుకున్న అనంతరం భూమిని పర్యాటక శాఖ థర్డ్ పార్టీకి అప్పగించిందని గుర్తు చేసింది. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్ట్‌ను టీటీడీ మరో చోటకి మార్చిందనే కారణంతో టీటీడీ, పర్యాటక శాఖ మధ్య జరిగిన భూ మార్పిడిని రద్దు చేయలేమని పేర్కొంది. పిల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆతిథ్యం ఇవ్వనున్న రుషికొండ! ప్యాలెసపై రెండు ఫ్లోర్లు వేసి హొటళ్లకు కేటాయింపు



క్రైం కౌంటర్ న్యూస్ అమరావతి, డిసెంబరు 24: ఆతిథ్య రంగ అవసరాలకు విశాఖ రుషికొండ ప్యాలెసను కేటాయించాలని యోచిస్తున్నామని మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వంపై భారంపడకుండా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరేలా త్వరలోనే రుషికొండపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వైసీపీ హయంలో రూ.వందల కోట్లు ఖర్చుచేసి నిర్మించిన రుషికొండ ప్యాలెస్ వినియోగంపై నిర్ణయంలో జరుగుతున్న జాప్యం పట్ల ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే దీనిపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ బుధవారం అమరావతి సచివాలయంలో మూడోసారి భేటీ అయింది. అధికారులు ప్యాలెసకు సంబంధించిన వివరాలను కమిటీకి వివరించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్యాలెస్ వినియోగంపై పలు ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. ప్యాలెస్ నిర్వహణకు తాజ్ లీలా, అట్మాస్ కోర్, ఫెమా సంస్థలు ముందుకు వచ్చినట్లు ఈ సమావేశంలో మంత్రి కేశవ్ తెలిపారు. అయితే, రుషికొండ భవనాలు హొటళ్ల నిర్వహణకు పూర్తి అనుకూలంగా లేవని ఆ సంస్థలు అభిప్రాయపడ్డాయని పేర్కొన్నారు. ప్యాలెసపై అదనంగా భవంతులు నిర్మిస్తే ఎలా ఉంటుందని సబ్ కమిటీ ఆలోచనలు చేసింది. ప్యాలెస్ నిర్మాణంలో కొన్ని మార్పులు చేసి, ఆతిథ్య రంగానికి కేటాయిస్తే బాగుంటుందనే ప్రతిపాదనకు మెజారిటీ మంత్రులు మొగ్గు చూపినట్టు తెలిసింది. అయితే, ఈ నెల 28న ఆన్‌లైన్‌లో భేటీ అయి అన్నిరకాల ప్రతిపాదనలపై మరోసారి చర్చించాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కాగా, బీచ్ ఫ్రంట్ వినియోగంపై కూడా కమిటీ సుదీర్ఘ చర్చ జరిపింది. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మాల్దీవులు, పుదుచ్చేరి తరహా విధానాలను అనుసరిస్తే బాగుంటుందనే అభిప్రాయం వచ్చింది. ఈ వివరాలను సమావేశానంతరం మీడియాకు పయ్యావుల కేశవ్, దుర్గేశ్ వెల్లడించారు.

ప్రస్తుత నిర్మాణాలు హొటళ్లకు పనికిరావు : కేశవ్

"రుషికొండ కింద ఉన్న తొమ్మిది ఎకరాలను హొటళ్ల కోసం అదనంగా కొంతమంది అడిగారు. అందులో ఏడు ఎకరాల్లో అదనపు భవనాలు, సదుపాయాలు కల్పించే వీలుంది. అయితే, అది సీఆర్‌జడ్ పరిధిలోకి వస్తోంది. అందువల్ల నిబంధనలు అంగీకరించవు. ఉన్న రెండెకరాలకు అదనంగా భూములేవైనా అందుబాటులో ఉన్నాయేమోనని పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న రుషికొండ ప్యాలెస్ నిర్మాణం హొటళ్ల నిర్వహణకు పనికిరాదు. ప్యాలెసపై అదనంగా మరో రెండు ఫ్లోర్లు వేస్తే హొటళ్లకు అనువుగా ఉ ంటుందనే అభిప్రాయం కమిటీ భేటీలో వచ్చింది.." అని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రుషికొండ ప్యాలెసలో చివర ఉన్న రెండు మూడు బ్లాకులు ప్రజలకు ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఉంచుతామని, మిగతావి హొటళ్లకు ఇచ్చే యోచన చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రజా ధనం వృ?థా అయిందని, రుషికొండ ప్యాలెస్ తెల్ల ఏనుగులా మారిందన్నారు. పర్యాటకశాఖ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించామని, నివేదిక వచ్చిన తర్వాత తదుపరి భేటీలో నిర్ణయం తీసుకుంటామని కేశవ్ తెలిపారు.

ఆదాయం పోయింది.. ఖజానాకూ భారం: దుర్గేశ్ రుషికొండ ప్యాలెసపై ప్రభుత్వం తల బద్దలు కొట్టుకోవాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం కల్పించిందని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. "పర్యాటకశాఖకు ఏటా రూ.7 కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే రిసార్ట్స్ స్థానంలో ప్యాలెస్ కట్టారు. దీని వల్ల ఆదాయం కోల్పోవడమే కాకుండా ప్రతి నెల రూ.25 లక్షల నిర్వహణ భారం పర్యాటకశాఖపై పడుతోంది. అందుబాటులో ఉన్న భూముల్లోనే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా, ప్రజల సందర్శనార్థం ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. సముద్రం ఆటుపోటుల వల్ల రుషికొండ కింద ఉన్న తొమ్మిది ఎకరాల్లో 2 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉంది. వాస్తవానికి అక్కడ 9 ఎకరాలు ఉందని ముందుకొచ్చిన మదుపుదారులు ముందుకొచ్చారు. వారికి ఇప్పుడు ప్రత్యామ్నాయం చూపించాల్సి ఉంది. సీఆర్‌జెడ్ నిబంధనలు పరిశీలించగా, కొండపై 60 వేల చ.అడుగుల్లో నిర్మాణానికి అనుకూలంగా ఉం దని గుర్తించాం. దీనికి సంబంధించి పలు సంస్థలు ముందుకు వచ్చాయి. వయబుల్ ప్రాజెక్టుపైనే దృష్టి సారించాం. త్వరలోనే రుషికొండ ప్యాలెస వినియోగ ంపై తుది నిర్ణయం తీసుకుంటా'మని దుర్గేశ్ తెలిపారు.

# పోలవరం.. జూన్‌కల్లా పూర్తికావాలి

**త్వరగా పూర్తిచేయాలన్నదే కేంద్రం ఉద్దేశం కూడా**

**బాధ్యతలు చేపట్టాక తొలిసారి ప్రాజెక్టు వద్దకు**

**మొదట పునరావాస గ్రామాల్లో పర్యటన**

**మౌలిక వసతులు, పరిహారంపై ఆరా**

**తర్వాత ప్రాజెక్టు క్షేత్ర ప్రాంతానికి సీఈవో**

**బట్రస్, డయాఫ్రం వాల్ పనులపై సంతృప్తి**

**జల విద్యుత్కేంద్రం కూడా సందర్శన**

క్రైం కౌంటర్ న్యూస్ అమరావతి/పోలవరం, డిసెంబరు 24 : పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌నాటికి పూర్తి చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) యోగేశ్ పైథాంకర్ దిశానిర్దేశం చేశారు. సీఈవోగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా బుధవారం ప్రాజెక్టు ప్రాంతంలో ఆయన పర్యటించారు. నిర్వాసితులకు అందిస్తున్న సహాయ పునరావాస కార్యక్రమాలను తెలుసుకునేందుకు తొలుత నేరుగా ముం పు ప్రాంతాలకు వెళ్లారు. నిర్వాసితులతో మాట్లాడారు. సహాయ పునరావాసం అందుతున్న తీరును వారిని, అధికారులను కూడా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రెండు దఫాలుగా దాదాపు రూ.2వేల కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో ప్రాజెక్టు అధికారులు ఆయనకు తెలియజేశారు. ఆ తర్వాత యోగేశ్ బృందం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుంది. వారికి ఈఎన్‌సీ నరసింహమూర్తి, మేఘా సీవవో ఏఎన్వీ సతీశ్‌బాబు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాజెక్టు స్పిల్‌వే, గ్యాప్-1, 2 ప్రాంతాలను.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల వద్ద బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని, కాంక్రీటు నాణ్యత ల్యాబ్‌లను బృందం సభ్యులు పరిశీలించారు. డయాఫ్రం వాల్ పనులు 83 శాతం పూర్తి కావడం.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పనులు 14 శాతం దాకా జరగడంపై యోగేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేస్తున్నారని గుర్తుచేశారు. ఇటీవల ఢిల్లీ వచ్చి కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్‌ను కలిసినప్పుడు కూడా ఇదే చెప్పారని తెలిపారు. కేంద్రం సైతం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసే ఉద్దేశంతో ఉందన్నా రు. డయాఫ్రం వాల్‌కు సంబంధించి ఇంకో 17 శా తం పనులే మిగిలి ఉన్నందున.. మరోవైపు సమాంతరంగా ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులూ చేపడుతున్నందున 2027 జూన్ లక్ష్యాన్ని చేరుకోవలసిందేనని స్ప ష్టం చేశారు. అనంతరం పోలవరం జల విద్యుత్కేంద్రాన్ని



సందర్శించారు. ఇప్పటికే మూడు యూ నిట్లు సిద్ధమయ్యాయని.. మిగిలిన పనులన్నీ 2027 నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టు సంస్థ వెల్లడించింది. అదేవిధంగా కుడి, ఎడమ ప్రధాన కాలువల కనెక్టివిటీ టన్నెళ్ల పనులనూ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి పనినీ పూర్తి చేసేందుకు నిర్దేశించిన గడువు, ఇతర వివరాలను, నిర్మాణాల పురోగతిని మేఘా సీవోవో వివరించారు. 2027లో గోదావరి ప ్ణష్కరాల నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూ పొందించుకుని పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. కేంద్రం పోలవరాన్ని ప్రతిష్ఠాత్మకం గా తీసుకుందని.. ఎలాంటి జాప్యం లేకుండా నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సీఈవో సూచించారు. క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ కె.శేషుబాబు, ఎస్‌ఈ కె.రామచంద్రరావు, క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఈ తిరుమలరావు, ఈఈ కె.బాలకృష్ణ, మేఘా జీఎం గంగాధర్, డీజీఎం మురళి పమ్మి, క్వాలిటీ కం ట్రోల్ ఈఈలు నరసింహారావు, ప్రేమ్‌చ ంద్, డీఈలు నిర్మల, శ్రీకాంత్, విజయ్‌కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నాడు జగన్ చేతులెత్తేశారు: నిర్వాసితులు మొదట పీపీఏ సీఈవో, ఎం.రఘురాం, పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్లు సీవీ సుబ్బయ్య, ఎం.రమేశ్ కుమార్, పీ అండ్ డీ డైరెక్టర్ కె.శంకర్‌తో కూడిన బృందం పోలవరం పునరావాస గ్రామాలను సందర్శించింది. ఎల్‌ఎన్‌డీపేట సమీపంలో ఉన్న కొండ్రుకోట (పంచాయతీ) పునరావాస కాలనీలో మౌలిక వసతులను.. పాఠశాల, అంగన్వాడీ సెంటర్, సచివాలయ భవనాలను పరిశీలించింది. అక్కడ నిర్వాసితులతో మాట్లాడి మౌలిక వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. వైసీపీ హయాంలో వారికి పరిహారం చెల్లించకపోవడంపై యోగేశ్ ఆరా తీశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు గోదావరి వరదల సమయంలో ముంపు ప్రాంతాలను సందర్శించారని.. కొంత మంది నిర్వాసితులను మాత్రమే కలిశారని వారు తెలిపారు. కేంద్రం నిధులిస్తేనే పరిహారం చెల్లించగలనని.. పునరావాస కాలనీలను నిర్మించగలనని.. లేదంటే తానేమీ చేయలేనంటూ ఆయన చేతులెత్తేశారని చెప్పారు. చంద్రబాబు గత ఏడాది ముఖ్యమంత్రిగా మళ్లీ బాధ్యతలు స్వీకరించాక.. రెండు సార్లు తమ బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా పరిహారం జమ చేశారని అన్నారు. అధికారులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# సినిమా



## "టికెట్ రేట్ కంటే పాప్ కార్న్ రేట్ ఎక్కువ అయింది.."

సినిమా టికెట్ రేట్లతో పోలిస్తే థియేటర్లలో పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్ ధరలే ఎక్కువగా ఉన్నాయన్న అభిప్రాయం ఇటీవలి కాలంలో సినిమా ప్రేక్షకుల నుంచి వినిపిస్తోంది. ఒక మధ్యతరగతి కుటుంబం సినిమా చూడాలంటే టికెట్‌తో పాటు ఇతర ఖర్చులు కలిపి ఒక్కొక్కరిపై కనీసం రూ.500 వరకు ఖర్చవుతోందని సినీ అభిమానులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో థియేటర్లకు వెళ్లడం కష్టమవుతోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ఇదే అంశంపై సినీ దర్శకుడు తేజ కూడా స్పందించారు. టికెట్ రేట్ల కంటే థియేటర్లలో పాప్‌కార్న్, ఇతర ఆహార పదార్థాల ధరలే ఎక్కువగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

థియేటర్లలో వాస్తవంగా ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తేజ అన్నారు. సినిమా టికెట్ రేట్లు, షూటింగ్ ప్రోత్సాహకాలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం గురువారం సమావేశం నిర్వహించింది. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి తేజతో పాటు పలువురు పంపిణీదారులు, సినిమా రంగ ప్రతినిధులు హాజరయ్యారు.

టికెట్ రేట్లపై సమగ్ర చర్చ

ఏపీలో సినిమా షూటింగ్‌లకు ఇస్తున్న రాయితీలు, ఇప్పటి వరకు అమలులో ఉన్న జీఓలు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఏపీ ప్రభుత్వం ఒక అంతర్గత సమావేశాన్ని నిర్వహించుకుంది. టికెట్ రేట్ల పెంపుపై కోర్టుల తీర్పులు, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై కూడా చర్చించింది. ఈ సమావేశానికి హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, న్యాయశాఖ కార్యదర్శి, ఎఫ్‌డీసీ అధికారులు, సినీ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డైరెక్టర్ లు హాజరయ్యారు.


ఒకే జీఓపై నిర్ణయం

ఈ సమావేశం అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ప్రతి సినిమాకు టికెట్ రేట్లు పెంచడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. టికెట్ రేట్లకు సంబంధించి ఒకే జీఓ ఉండేలా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. పెద్ద బడ్జెట్ సినిమాల్లో ఆర్టిస్టుల రెమ్యునరేషన్ అంశంపైనా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని.మంత్రి తెలిపారు. డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలతో విడిగా సమావేశాలు నిర్వహించి సినిమా పరిశ్రమ సమస్యలను విని పరిష్కారం చూపుతామని అన్నారు దుర్గేష్. తెలుగు సినిమా పాన్ వరల్డ్ స్థాయికి ఎదిగిందని, వేల కోట్ల బడ్జెట్‌లతో సినిమాలు రూపొందుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

సినిమా షూటింగ్‌లకు ప్రోత్సాహం, టికెట్ రేట్ల అంశాలపై జరిగిన ఈ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సినీ దర్శకుడు తేజ, థియేటర్లలో ప్రస్తుతం ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. టికెట్ రేట్లతో పోలిస్తే పాప్‌కార్న్, ఇతర ఆహార పదార్థాల ధరలే ఎక్కువగా ఉండటం ప్రేక్షకులను థియేటర్లకు దూరం చేస్తోందని అన్నారు. ఓటిటి వేదికలు, పైరసీ కారణంగా సినిమా పరిశ్రమకు గణనీయమైన నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. పరిశ్రమ వైపు నుంచి తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రభుత్వం ముందు ఉంచామని, తెలుగు సినిమా ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు పొందేలా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తేజ అభిప్రాయపడ్డారు





## వారానికి ఇవి 2 పచ్చిగానే నమిలి తింటే.. జీవితంలో క్యాన్సర్ రాదట!

క్యారెట్లు తినడం ఆరోగ్యానికి మంచిదన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. వారానికి కనీసం రెండుసార్లు క్యారెట్లు తినడం వల్ల తీవ్రమైన వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. క్యారెట్లను సలాడ్ల నుంచి జ్యూస్‌ల వరకు అనేక విధాలుగా తినవచ్చు. ముఖ్యంగా శీతాకాలంలో క్యారెట్లు తాజా కూరగాయలు, పండ్లతో పాటు తక్కువ ధరకే లభిస్తాయి. కాబట్టి ఈ కాలంలో తాజా క్యారెట్లను తినడం చాలా సులువు. ఇవి తినడానికి రుచికరంగా కూడా ఉంటాయి. ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి.

కొలొరెక్టల్ క్యాన్సర్‌ను నివారించడంలో క్యారెట్లు భేష్

కొంతమంది తాజా క్యారెట్లను పచ్చిగా తింటారు. మరికొందరు వాటిని వివిధ వంటలలో తయారు చేసి తింటారు. ప్రత్యేకత ఏమిటంటే మీరు ఈ క్యారెట్లను ఎలా తిన్నా, అవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇటీవలి అధ్యయనం ప్రకారం.. వారానికి 2 నుండి 4 పచ్చి క్యారెట్లు తినడం వల్ల కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదాన్ని దాదాపు 17 శాతం తగ్గించవచ్చుట. కొలొరెక్టల్ క్యాన్సర్ అనేది పెద్దప్రేగు లేదా పురీషనాళంలో ప్రారంభమయ్యే క్యాన్సర్. ఇది సాధారణంగా పాలిప్స్ అని పిలువబడే పెరుగుదలల వల్ల సంభవిస్తుంది.

క్యారెట్లలో కెరోటినాయిడ్లు, లుటిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. వీటిని వారానికి కనీసం రెండుసార్లు తీసుకోవడం పాలిప్స్ పేగుల్లో ఏర్పడకుండా నిరోధిస్తుంది. క్యారెట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. వాటి శోథ నిరోధక లక్షణాల కారణంగా అవి రక్త నాళాలపై ఒత్తిడిని తగ్గిస్తాయి. విటమిన్ కె, విటమిన్ బి6 వంటి ఇతర పోషకాలకు మంచి మూలం. వీటిలోని బీటా-కెరోటిన్ రేచీకటి, కంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. అయితే క్యారెట్లతో తయారు చేసిన స్వీట్లు లేదా ఇతర ఆహారాలను తినడం కంటే పచ్చి క్యారెట్లు తినడం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులోని ఫైబర్ కంటెంట్ కారణంగా వీటిని ఎక్కువగా తినడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి తినేటప్పుడు జాగ్రత్తగా ఉండటం మంచిది.



## వీటి పేరు ఏంటో తెలుసా..?

ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవాళ్లు తప్పకుండా ఫ్రూట్స్ ఇష్టపడతారు. రోజుకో ఆపిల్ తినండి అని కొందరు చెబితే.. మరికొందరు మన ప్రాంతంలో దొరికే జామ కాయ అంతకంటే మంచిది అని సలహా ఇస్తారు. అయితే ఏది ఏమైనా పండ్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిలో ఉండే విటమిన్లు , ఖనిజాలు, ఫైబర్ శరీరానికి ఎంతో అవసరము. వీటిని నిత్యం తీసుకోవటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగటంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇవి శరీరానికి కావలసిన శక్తిని ఇవ్వటంతో పాటు చర్మం , గుండె , కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుతాయి.ఏ పండు దేనికి పనిచేస్తుంది ఆపిల్ గుండెకి మేలు చేస్తే.. అరటిపండు తినటం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. నారింజలో విటమిన్ %జ% ఉండటం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. పండ్లలో రారాజు మామిడిలో విటమిన్ %ూ, జ% పుష్కలంగా ఉంటాయి. బొప్పాయి తినటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది , ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నాయని చెబుతారు వైద్యులు , డైటీషియన్లు. అందుకే ప్రతి ఒక్కరు తమ ఆహారం లో రోజూ 2 నుంచి మూడు రకాల పండ్లు తీసుకోవాలని చెబుతారు.

ప్రకృతి మనకు అందించిన మరో వరం నోని..

పండ్ల గురించి మనలో చాలా మందికి ఎంతో కొంత అవగాహన ఉంటుంది. అయితే సీజన్‌ను బట్టి ప్రాంతాన్ని బట్టి అక్కడ లభించే పండ్లు ఆయా ప్రాంతాల ప్రజలు తమ ఆహారం లో తీసుకుంటారు. ఇపుడు వాణిజ్యం విస్తృతి పెరగటంతో దేశీయంగా లభించే పండ్లతో పాటు విదేశీ ఫలాలు మనకు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే నోని పండు మన భారతదేశంలోనే పెరుగుతుంది. ఆరోగ్యానికి మేలు చేసే ఈ పండు మనకు ప్రకృతి ప్రసాదించిన వరంగా చెబుతారు. భారతదేశం సహా ఉష్ణమండల ప్రాంతాల్లో పెరిగే యీ నోని చెట్టు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు , విటమిన్లు , ఖనిజాలు సంవృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధకశక్తిని మెరుగుపరుస్తాయి. ప్రాచీనకాలం నుంచి ఆయుర్వేదంలో ఈ పండ్లను వినియోగిస్తున్నారు. జ్యూస్ రూపంలో ఎక్కువగా దిన్ని తీసుకుంటారు. వాసన , రుచి కాస్త భిన్నంగా ఉన్నా ఇందులో ఉన్న ఔషధ గుణాల వలన ఈ పండు ఎంతో విలువైనదిగా ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

## మెరుపు సెంచరీతో ,,,,

### సచిన్ రికార్డును బద్ధలుకొట్టిన విరాట్ కోహ్లి

దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఆడుతున్నాడు. ఢిల్లీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న కింగ్ కోహ్లీ.. బెంగళూరు వేదికగా బుధవారం (డిసెంబర్ 24) ఆంధ్ర జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. దాదాపు 130 స్ట్రైక్ రేట్‌తో 83 బంతుల్లో సూపర్ సెంచరీ (101 బంతుల్లో 131 పరుగులు) నమోదు చేశాడు. ఈ శకత ప్రదర్శనతో సరికొత్త రికార్డు క్రియేట్ చేశాడు విరాట్ కోహ్లి. దీంతో ఇప్పటివరకు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెందూల్కర్ పేరిట ఉన్న రికార్డును బద్ధలుకొట్టాడు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. రిక్కీ బూయ్ (122) సెంచరీతో అదరగొట్టాడు. ఓపెనర్లతో సహా మిగతా బ్యాటర్లు ఫర్వాలేదనిపించారు. అయితే ఢిల్లీ బౌలర్లలో సమర్జీత్ సింగ్ ఒక్కడే ఐదు వికెట్లు తీయడం గమనార్హం. ఇక ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు పడగొట్టాడు. ఆంధ్ర నిర్దేశించిన భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ.. ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్ అర్పిత్ రానా డకౌట్ అయ్యాడు. అనంతరం బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ.. మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్యతో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. 114 పరుగుల వద్ద ప్రియాన్ష్ (74) పెవిలియన్ చేరడంతో.. మ్యాచ్‌ను తన కంట్రోల్‌కి తీసుకున్నాడు విరాట్ కోహ్లి. అనతరం విజృంభించాడు కింగ్ కోహ్లి. ధనాధన్ ఇన్నింగ్స్‌లో ఢిల్లీని విజయ తీరాలకు చేర్చాడు. అయితే ఈ సూపర్ సెంచరీతో అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు విరాట్. లిస్టు-ఏ వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 16,000 పరుగులు చేసిన క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. కోహ్లి కేవలం 330 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. గతంలో ఈ రికార్డ్ "గాడ్ ఆఫ్ క్రికెట్" సచిన్ తెందూల్కర్ పేరిట ఉండే. సచిన్ 391 ఇన్నింగ్స్‌లో 16 వేల పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. కాగా, దాదాపు 15 ఏళ్ల తర్వాత మళ్లీ విజయ్ హజారే ట్రోఫీ ఆడుతున్న కోహ్లీ ఈ రికార్డ్ సృష్టించాడు. కాగా, ఈ మ్యాచ్‌లో చేసిన సెంచరీ లిస్ట్-ఏ క్రికెట్‌లో 58వ శతకం కావడం గమనార్హం. గతంలో కూడా విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లి పేరిట మంచి రికార్డు ఉంది. విరాట్ 13 మ్యాచుల్లో 68 సగటుతో 819 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కాగా, న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్‌కు ముందు కింగ్ కోహ్లి ఇలా ఫామ్‌లోకి రావడం టీమిండియాకు మంచిపరిణామమే.




## 'బూమ్రా, పంత్ నాకు సారీ చెప్పారు'.. కోల్‌కతా వివాదంపై బవుమా క్లారిటీ

ఇటీవల దక్షిణాఫ్రికా ఇండియా పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్, సౌతాఫ్రికా తొలి టెస్టు ఆడాయి. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో ప్రోటీస్ కెప్టెన్ తెంబ బావుమా.. టీమిండియా ప్లేయర్లు జస్ప్రీత్ బూమ్రా, రిషభ్ పంత్ వివాదం చర్చనీయాంశమైంది. దీనిపై క్రికెట్ అభిమానులు బూమ్రాపై విమర్శలు గుప్పించారు. తాజాగా ఈ విషయంపై స్పందించాడు తెంబ బవుమా. బుమ్రా, పంత్ తనకు క్షమాపణ చెప్పారని తెలిపాడు.కోల్‌కతా టెస్టులో బూమ్రా, పంత్ తన గురించి చేసిన వ్యాఖ్యల గురించి బవుమా క్లారిటీ ఇచ్చాడు. తనపై చేసిన కామెంట్ల విషయంలో బూమ్రా, పంత్ తనకు క్షమాపణ తెలిపారని చెప్పాడు. వాళ్లు సారీ చెప్పినప్పుడు.. ఎందుకు చెబుతున్నారో అర్థం కాలేదన్నాడు. అనంతరం ఈ విషయం తన మీడియా మేనేజర్‌తో మాట్లాడితేనే తెలిసిందని చెప్పాడు. అయితే గ్రౌండ్‌లో జరిగిన సంఘటనలను అక్కడే వదిలేస్తామని.. కానీ మైదానంలో ప్రత్యర్థి ప్లేయర్లు అన్న మాటలను మర్చిపోలేమని బవుమా అన్నాడు. అలాగని ఆ ప్లేయర్లపై ద్వేషం పెంచుకోలేమని చెప్పాడు. అలాంటి మాటలు మరింత మోటివేషన్ లాగా పనిచేస్తాయని చెప్పాడు. కాగా, ఈ టెస్ట్ సిరీస్‌లో 2-0 తేడాతో భారత్‌ను వైట్‌వాష్ చేసింది దక్షిణాఫ్రికా. అసలేంటి వివాదం..దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా 13 ఓవర్లో ఆఖరి బంతిని బవుమాకు వేశాడు. షాట్ ఆడే క్రమంలో బాల్ బవుమా ప్యాడ్‌కు తగిలింది. దీంతో బౌలర్‌తో పాటు టీమిండియా ఫీల్డర్లు కూడా ఎల్బీడబ్ల్యూకు అప్పీల్ చేశారు. అంపైర్ మాత్రం అవుట్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో డీఆర్ఎస్ తీసుకునే విషయంలో బుమ్రా, వికెట్ కీపర్ పంత్ చర్చించుకున్నారు. అయితే బంతి బవుమా ప్యాడ్స్‌కు ఎత్తుగా తగిలిందని పంత్ చెప్పాడు. అందుకు బుమ్రా స్పందిస్తూ 'బౌనా భీ హై' అని అన్నాడు. అయితే 'బౌనా' అంటే మరుగుజ్జు అని అర్థం. బవుమా పొట్టిగా ఉండటంతో బంతి స్టంప్స్‌ను మిస్ అయ్యే అవకాశం ఉందని చెప్పడానికి బుమ్రా ఆ పదం ఉపయోగించాడు. అయితే దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవ్వడంతో నెటిజన్లు బుమ్రాపై మండిపడ్డారు. కాగా, ఈ విషయంపై దక్షిణాఫ్రికా బ్యాటింగ్ కోచ్ యాష్‌వెల్ ప్రిన్స్ అప్పుడే స్పందించాడు. ఇలా జరగడం ఇదే తొలిసారని.. కానీ ఇప్పటివరకు డ్రెస్సింగ్ రూమ్‌లో ఎలాంటి చర్చ జరగలేదన్నాడు. ఇక్కడ జరిగిన దానివల్ల ఎవ్వరికీ పెద్దగా ఇబ్బంది కలగలేదని అనుకుంటున్నట్లు చెప్పాడు. అయితే బుమ్రా సారీ చెప్పడంతో ఈ వివాదానికి ఎండ్ కార్డ్ పడినట్లు అయింది.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com